ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కర్ణాటక వార్తలు

సోమవారం 11 నవంబరు 2024



న్యూస్ బాక్స్

యూనియన్‌బ్యాంకు నారీశక్తి శాఖలకు శ్రీకారం

- వర్చువల్‌గా కేంద్ర ఆర్థికమంత్రి ఆవిష్కరణ



లబ్దిదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, శోభాకరంద్లాజె

బెంగళూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళలకు బ్యాంకింగ్ సేవలు సరళీకృతం చేయాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దేశంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటుచేసిన నారీశక్తి శాఖలను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ లాంచనంగా ప్రారంభించారు. బెంగళూరు పర్యటనలో ఉన్న మంత్రి నారీశక్తిశాఖలను ప్రారంభించారని బ్యాంకు ఎండీ, సీఈఓ మణిమేఖలై తెలిపారు. బెంగళూరు, చెన్నై, విశాఖపట్నం, జైపూర్‌లలో ఒకేసారి వర్చువల్ రూపంలో నారీశక్తిశాఖలు శ్రీకారం చుట్టారని వారు తెలిపారు. మహిళలకోసం ప్రత్యేకంగా సాంకేతికతకు అనుగుణంగా ప్రారంభించామన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు, స్టార్టప్‌లకు, మహిళా సంఘాలకు చేయూత నిచ్చేందుకు శాఖలు ప్రత్యేకంగా చొరవ చూపుతాయన్నారు. మహిళా గ్రూప్‌లకు రుణాలతోపాటు నైపుణ్యం, మెంటార్‌షిప్, నెట్‌వర్కింగ్ వంటి సహకారాన్ని శాఖల ద్వారా అందించదలిచామన్నారు. ఇదే సందర్భంగా పలువురు లబ్ధిదారులకు రుణపత్రాలను కేంద్రమంత్రి అందించారు. కేంద్ర మంత్రి శోభాకరంద్లాజె పాల్గొన్నారు.

హొళెనరసీపురలో గడ్డం వివాదం సుఖాంతం


బెంగళూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హాసన్ జిల్లా హొళెనరసీపుర నర్సింగ్ కళాశాల విద్యార్థులు గడ్డం తొలగించాలనే వివాదం సుఖాంతమైంది. జమ్మూ కశ్మీర్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. కళాశాల నిబంధనల ప్రకారం విద్యార్థులు గడ్డం తొలగించాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఇందుకు కశ్మీర్ విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈమేరకు జమ్మూ-కశ్మీర్ స్టూడెంట్ ఫెడరేషన్ విద్యార్థులు సోషల్‌మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజులుగా వివాదం సాగుతున్న తరుణంలోనే శనివారం జమ్మూ-కశ్మీర్ విద్యార్థులలో ఒకరైన ఉమర్ మీడియాతో మాట్లాడుతూ మాకు గడ్డం తొలగించాలని ఎవరూ ఒత్తిడి చేయలేదన్నారు. కళాశాల నిబంధనలు పాటిస్తామన్నారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నర్సింగ్ కళాశాల అయినందున క్లినికల్ ల్యాబ్‌లకు వెళ్లాల్సి ఉంటుందని, అక్కడ గడ్డంతో ఉండడం సమస్య అవుతుందన్నారు. విద్యార్థులందరికీ ఒకే నిబంధన సూచించామన్నారు.

మంత్రి చలువరాయస్వామి, జయరాం మధ్య వాగ్వాదం

బెంగళూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంత్రి చలువరాయస్వామి, మండ్య జిల్లా కాంగ్రెస్ కీలకనేత కిలార జయరాంల మధ్య తీవ్రమైన వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్యే రమేశ్ బండిసిద్దేగౌడ కుమార్తె నిశ్చితార్థంలో ఇద్దరూ పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి హోటల్‌లో ఎదురెదురుగా తారసపడినవారు గొడవ చేసుకున్నారు. జయరాం ముందుగా మంత్రి చలువరాయస్వామిని దూషించడంతోపాటు ఆయనపై దూసుకెళ్లడంతో మంత్రి అనుచరులు నియంత్రించినట్లు తెలుస్తోంది. ఇదే విషయమై జయరాం మీడియాతో మాట్లాడుతూ మామధ్య ఎలాంటి వాగ్వాదం జరగలేదని, నిశ్చితార్థానికి వెళ్లిన వేళ మంత్రికి నమస్కరించి బయటకు వచ్చానన్నారు. కానీ కేంద్రమంత్రి కుమారస్వామి సంచలనమైన ఆరోపణలు చేశారు. బదిలీల దందాలో ఇరువురి మధ్య చోటు చేసుకున్న వివాదమే ఒకరిపై ఒకరు చేయిచేసుకునే దాకా వెళ్లిందన్నారు.

చన్నపట్టణ చిన్నోడు ఎవరో..?







నిఖిల్

- దేవెగౌడ, డీకేశి కుటుంబాలకు ప్రతిష్ఠాత్మకం
- రెండుసార్లు ఓడిన నిఖిల్‌కు పరీక్ష
- యోగేశ్వర్‌కు హస్తం కలిసొచ్చేనా..?



సీపీ యోగేశ్వర్

బెంగళూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశవిదేశాలకు ఎగుమతి అయ్యే బొమ్మల తయారీ కేంద్రంగానే కాకుండా బెంగళూరు-మైసూరు ప్రధాన నగరాల మధ్యన ఉన్న చన్నపట్టణ ప్రస్తుత ఉప ఎన్నికల నేపథ్యంలో అందరినోటా అక్కడి రాజకీయమే చర్చనీయాంశం అవుతోంది. చన్నపట్టణలో గెలిచే చిన్నోడు ఎవరనేది ప్రజలు నిర్ణయించాల్సి ఉంది. ఒక్కలిగ సమాజం ప్రాబల్యం కల్గిన చన్నపట్టణలో ఇరువురు కీలక అభ్యర్థులు అదే సామాజికవర్గానికి చెందినవారు కావడం ప్రత్యేకం. ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన జేడీఎస్ కీలక నేత కుమారస్వామి మారిన రాజకీయాలతో ఐదు నెలలక్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మండ్య నుంచి పోటీ చేసి విజయం సాధించి కేంద్రంలో భారీ పరిశ్రమలశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. కుమారస్వామి రాజీనామాతో ప్రస్తుతం ఉప ఎన్నిక అనివార్యమైంది. కేంద్రమంత్రి కుమారస్వామి తన కుమారుడు నిఖిల్‌ను ఉప ఎన్నికలో బీజేపీ-జేడీఎస్ పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా బరిలోకి దించారు. ఇదే స్థానం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది దాదాపు అన్ని రాజకీయ పార్టీల్లో కొనసాగిన సీపీ యోగేశ్వర్ అనూహ్యంగా చివరిక్షణంలో కాంగ్రెస్ అభ్యర్థి అయ్యారు. ఇద్దరికి ఒకే విధమైన వెనుకంజ ఉంది. సీపీ యోగేశ్వర్ ఇదేస్థానం నుంచి వరుసగా రెండుసార్లు ఓటమి చెందారు. ఇక నిఖిల్ రాజకీయ అరంగేట్రం చేశాక 2019లో మండ్య లోక్‌సభ నుంచి పోటీ చేసి ఓడిపోగా, 2023 శాసనసభ ఎన్నికల్లో రామనగర నుంచి పోటీ చేసి ఓటమి చవిచూశారు. ఇలా రాజకీయాల్లో అడుగు పెట్టి వరుసగా రెండు ఎన్నికల్లో ఓటమి చెందిన నిఖిల్‌కు ఇది అత్యంత క్లిష్టమైన ఎన్నికగా ఉంది.

● జేడీఎస్ కోటగా మలుపు తిప్పుకున్న కుమారస్వామి చన్నపట్టణ నుంచి నిఖిల్‌ను గెలిపించుకోవడం ద్వారా కుమారుడి రాజకీయ భవిష్యత్తును పటిష్టం చేయాలని భావిస్తున్నారు.

దేవెగౌడ, డీకే శివకుమార్ కుటుంబాలకు ప్రతిష్ట

చన్నపట్టణ ఎన్నిక రాష్ట్రంలో జరుగుతున్న మరో రెండు స్థానాల ఉప ఎన్నికలకంటే ప్రతిష్ఠాత్మకంగా మారింది. చన్నపట్టణలో ఒక్కలిగ సమాజం ప్రాబల్యం ఉండగా జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ, డీసీఎం, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ కుటుంబాల మధ్య ప్రతిష్ఠాత్మకంగా మారింది. 2018 ఎన్నికల్లో జేడీఎస్‌తో కలసి కాంగ్రెస్ పార్టీ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు సీఎం కుమారస్వామికి కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ అత్యంత సన్నిహితుడిగా వ్యవహరించారు. 18 నెలల్లో ప్రభుత్వం వీగిపోయాక వీరిమధ్య దూరం పెరిగింది. 2023 శాసనసభ ఎన్నికల వేళ రామనగర జిల్లా నుంచే వీరిద్దరూ రాజకీయం చేశారు. కనకపుర నుంచి డీకే శివకుమార్ గెలుపొందగా, చన్నపట్టణ నుంచి జేడీఎస్ తరపున కుమారస్వామి విజయం సాధించారు. అప్పటిదాకా రామనగర సిట్టింగ్ ఎమ్మెల్యేగా కొనసాగిన అనితా కుమారస్వామి స్థానంలో నిఖిల్‌ను బరిలో దించగా డీకే శివకుమార్ వ్యూహాత్మకంగా వ్యవహరించి ఓడించారు. ఆ తర్వాత కూడా రాజకీయంగా ఇరువురిమధ్య భారీస్థాయిలో విబేధాలు రాలేదు. 2024లోక్‌సభ ఎన్నికల వేళ బెంగళూరు గ్రామీణ నుంచి కాంగ్రెస్ తరపున హ్యాట్రిక్ సాధించాలని రంగంలో డీకే సురేశ్ దిగారు. ఈ ఎన్నికల్లో జేడీఎస్ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకోవడంతో సదరు స్థానం జేడీఎస్ కోటాకు చేరింది. అనూహ్యంగా దేశంలోనే ఉత్తమ డాక్టర్‌గా పేరొందిన జయదేవ ఆసుపత్రుల మాజీ డైరెక్టర్, దేవెగౌడ అల్లుడు, కుమారస్వామి బావ డాక్టర్ సీఎన్ మంజునాథ్ అభ్యర్థిని చేశారు. ఎన్నికల్లో డీకే సురేశ్ చిత్తుగా ఓడిపోవడంతో రెండు కుటుంబాల మధ్య రాజకీయ విబేధాలు భగ్గుమంటున్నాయి. ఇదే తరుణంలో చన్నపట్టణ ఎన్నికలను ఇరుకుటుంబాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. తొలుత డీకే సురేశ్ అభ్యర్థి అవుతారని భావించగా, బీజేపీ నుంచి యోగేశ్వర్‌కు టిక్కెట్ దక్కకపోవడంతో చివరి రోజు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరి అభ్యర్థి అయ్యారు. ఈ స్థానం కాంగ్రెస్, బీజేపీల కంటే రెండు కుటుంబాల మధ్య ప్రతిష్ఠాత్మకంగా మారింది. వయోభారాన్ని లెక్క చేయకుండా మనవడి కోసం చన్నపట్టణలో దేవెగౌడ మకాం వేశారు. కుమారస్వామి చన్నపట్టణను వీడి రాష్ట్రంలో జరుగుతున్న మరో రెండుస్థానాలతోపాటు మహారాష్ట్ర, జార్ఖండ్‌లవైపు తొంగి చూడలేదు. యడియూరప్ప, విజయేంద్ర వంటి నేతలు రోజూ ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి సీఎం గ్రామాలవారీగా ప్రచారానికి వెళ్తున్నారు. డీసీఎం డీకే శివకుమార్, ఆయన సోదరుడు డీకే సురేశ్ గ్రామాలవారీగా ప్రచారం సాగిస్తున్నారు.

● నియోజకవర్గంలో 2,32,836 మంది ఓటర్లు ఉండగా పురుషులు 2,12,271మంది, మహిళలు 1,20,557 మంది, ఇతరులు 8 మంది ఉన్నారు. 2023 ఎన్నికల్లో జేడీఎస్ నుంచి పోటీ చేసిన కుమారస్వామి 96,592 (48.83శాతం) ఓట్లు సాధించగా బీజేపీ నుంచి పోటీ చేసిన సీపీ యోగేశ్వర్ 80,677 (40.79 శాతం) కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన గంగాధర్‌కు 15,374 (7శాతం) ఓట్లు దక్కాయి. సీపీ యోగేశ్వర్ ఇక్కడ ప్రభావి నియాకుడిగా ఉన్నారు. 1999 నుంచి 2018వరకు ఎమ్మెల్యేగా ఉన్నారు. 2018 ఎన్నికల్లో కుమారస్వామి చేతిలో ఓటమి చెందారు. 2023లోనూ కుమారస్వామిదే పైచేయి అయ్యింది. అయితే సీపీ యోగేశ్వర్ బీజేపీలో క్రియాశీలకంగా రాణించి ఎమ్మెల్సీగా వ్యవహరించారు. ప్రస్తుత ఎన్నికల కోసం ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు.



యూవీసీఈ పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

యూవీసీఈలో సమ్మేళనం

బెంగళూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ ఆఫ్ విశ్వేశ్వరయ్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (యూవీసీఈ) పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక నగరంలో జరిగింది. 1974లో ఇంజనీరింగ్ చదివిన వారు 50 ఏళ్ల సంబరాలు చేసుకున్నారు. పూర్వ విద్యార్థి బీఎస్‌ఎంబిటీ కళాశాల చైర్మన్ నారాయణరావు ఆర్ మానె మాట్లాడుతూ కళాశాలలో చదువుకున్న రోజులు గుర్తుకు వచ్చాయన్నారు. ఇక్కడి చదువు మా ఎదుగుదలకు కారణమైందన్నారు. కళాశాల అభివృద్ధి కోసం ఏటా రూ.2లక్షలు కానుకగా ఇస్తానని ప్రకటించారు. అప్పట్లో రెండు రూపాయలు ప్యాకెట్ మనీగా ఇచ్చేవారని, బస్సు చార్జీలతోపాటు టిఫిన్, భోజనం కూడా సరిపోయేదని గుర్తు చేసుకున్నారు. జ్ఞానభారతి క్యాంపస్‌లో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న తొలి బ్యాచ్ మాదే అనేది గర్వకారణంగా ఉందన్నారు. వాస్తు శిల్పి రాజుగోపాల్ మాట్లాడుతూ ఇక్కడి అధ్యాపకులు వేసిన పునాది మా క్రమశిక్షణకు కారణమైందన్నారు. కళాశాలలో మా బ్యాచ్ అత్యంత పోకిరిగా ఉండేదని, సాంస్కృతిక కార్యక్రమాల్లో మాకే బహుమతులు వచ్చేవన్నారు.

ష్..! గప్‌చుప్..!

- బహిరంగ ప్రచారాలు బంద్
- ఆగిపోయిన మైక్ సౌండ్స్
- నిలిచిపోయిన మాటల యుద్ధం
- సందూరును వీడిన నేతలు



బళ్లారి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నిక బహిరంగ ప్రచారం ఆదివారం తెర పడింది. పోలింగ్ రోజుకు 48 గంటలు ముందు ప్రచారం నిలిపేయాలని ఎన్నికల కమిషన్ నిబంధన. ప్రధాన రాజకీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీ రెండూ బహిరంగ ప్రచారం ముగించాయి. ఉప ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్, బీజేపీలు రెండు పార్టీల ప్రచారాలు హోరెత్తాయి. సందూరు క్షేత్రానికి పదిహేను రోజల ముందే పార్టీల ప్రధాన నాయకులు చేరుకుని ఇక్కడే మకాం వేశారు. బీజేపీ తరఫున కేంద్ర మంత్రులు ప్రహల్లాద్ జోషి, రైల్వే సహాయ మంత్రి సోమణ్ణ, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర, ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, కర్ణాటక, తమిళనాడు బీజేపీ ఇన్‌చార్జి సుధాకర్‌రెడ్డి, రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీ శ్రీరాములు బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతు గెలుపునకు జోరుగా ప్రచారం చేశారు.

● కాంగ్రెస్ నుంచి ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు సంతోష్ లాడ్, జమీర్ అమ్మద్, ఎంపీ తుకారాం, మాజీ మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, గణేష్, నాగరాజు, బుడా అధ్యక్షుడు జేఎస్ ఆంజనేయులు, మేయర్ ఎం. నందీష్ బాబు, కార్పొరేటర్లు విక్కీ, వెంకటేశ్ హెగ్డే, తదితరులు ఆ పార్టీ అభ్యర్థి విజయలక్ష్మి గెలుపు కోసం ప్రచారం చేశారు.

● రెండు పార్టీలూ ప్రతి గ్రామంలో బహిరంగ సభలు పెట్టడం, అలాగే గ్రామాల్లోని వీధుల్లో ప్రచారం చేయడంతో ఆయా గ్రామాలు నాయకుల వాహనాలు, ప్రచార రథాలు, మైకుల శబ్దాలతో దద్దరిల్లాయి. ఇక ఆదివారం సాయంత్రం బహిరంగ ప్రచారానికి తెరపడడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీల పెద్దలు, నాయకులు అంతా వెనుదిరిగి సందూరును ఖాళీ చేశారు. ఉన్న నాయకులు, స్థానికులు గ్రామాల్లో ఉంటున్నారు.

ఓటర్లకు నోటు ఎర..?

- తెరుచుకున్న నోట్ల మూటలు..
- రెండు పార్టీలూ పంపకాలకు సమాయత్తం



బళ్లారి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికల్లో గెలుపునకు రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నోట్ల మూటలు విప్పారు. ఈ ఉప ఎన్నికలు రెండు పార్టీలూ ప్రతిష్ఠాత్మకంగానే భావించి ధన బలంతో గెలుపు సాధ్యం అనే ఆలోచనలో ఉన్నాయి. బళ్లారి జిల్లా సందూరు ఉప ఎన్నికలో రెండు పార్టీలూ ఇప్పటికే ప్రచారం, పంపకాలు పేరుతో రూ.వందల కోట్లు ధనం వెచ్చించారు. ఇక ఓటర్లకు ఇచ్చేందుకు సిద్ధమయ్యారని సమాచారం. సందూరు నియోజకవర్గంలో 2,36,402 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. పార్టీ అభ్యర్థి గెలవాలంటే మహిళా ఓటర్లు కీలకం కావున వారి ఓట్లను రాబట్టుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ రెండూ ప్రయత్నిస్తున్నాయి. పురుషులు అలగకుండా వారికి కూడా సమన్యాయం చేయాలనే అలోచనతో ఓటర్లకు డబ్బులు పంచేందుకు సిద్ధమవుతున్నారు. బీజేపీలో గాలి జనార్దన్‌రెడ్డి అన్నీతానై వ్యవహరిస్తున్నారు. ఇక ఆయనకు ఓటర్లను డబ్బుతో ఎలా ఆకట్టుకోవాలో బాగా తెలుసు. ఓటర్లకే నేరుగా డబ్బులు ముట్టచెప్పాలనే ఆలోచనలో ఉన్నారని సమాచారం. ఇక కాంగ్రెస్‌లో మంత్రి సంతోష్ లాడ్ అన్నిటిలోనూ ఆరితేరిన వ్యక్తి. ఆయనకు కూడా రాజకీయ చదరంగంలో ఎక్కడా తీసిపోడు. ఇరు పార్టీల నాయకులూ గెలుపునకు నోట్ల మూటలు విప్పుతున్నారని అని సమాచారం. ఓటుకు నోటు ఇచ్చేదా లేదా ఇంటిల్లికీ ప్యాకేజీ ఇచ్చేదా అనేది పార్టీలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే ఒక పార్టీ ఓటుకు రూ.2 వేలు పంచేందుకు సిద్ధమైంది. మరో పార్టీ అంతకన్నా ఎక్కువ ఇవ్వాలని భావిస్తుంది. ఏది ఏమైనా సందూరు ఉప ఎన్నికలో రెండు పార్టీలూ డబ్బు విచ్చలవిడిగా పంపకాలు చేస్తున్నా ఎన్నికల అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

నేడు ఒనకె ఓబవ్వ జయంతి

బాగేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయంలో ఒనకె ఓబవ్వ జయంతిని సోమవారం సరళంగా ఆచరించనున్నట్లు తహసీల్దారు మనీశా మహేశ్‌పత్రి అభిప్రాయ పడ్డారు. సన్నాహకసభలో ఆమె మాట్లాడుతూ ఒనకె ఓబవ్వ మహి ళా సమాజానికి మాదిరిగా ఉన్నారన్నారు. శారీరకంగా మాన సికంగా తనను తాను పురుషులకు ఏవిషయంలో తక్కువకాదని నిరూపించిన వీరవనితగా నిలిచారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాలూకా పంచాయతీ సభాంగణంలో కార్యక్రమాన్ని అర్థ వంతంగా ఆచరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సామాజిక ప్రముఖులు రామప్ప, డాక్టర్ శ్రీనాథ్, పాళ్యకెరె వెంకటేశ్, కేవీ రమేశ్, బిళ్ళూరు నాగరాజు, వీ కృష్ణప్ప, వేణు తదితరులు పాల్గొన్నారు.

డీసీఎం, మంత్రి ఖర్గే పీఎస్ అంటూ మోసం

- యువకుడి అరెస్టు

బెంగళూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): డీసీఎం డీకే శివకుమార్, మంత్రి ప్రియాంక ఖర్గేలకు వ్యక్తిగత కార్యదర్శిగా ప్రచారం చేసుకుంటూ ప్రభుత్వ ఉద్యోగులు, ఇతరులకు మోసం చేస్తున్న వ్యక్తిని విధానసౌధ పోలీసులు అరెస్టు చేశారు. తుమకూరుకు చెందిన రఘునాథ్ (38) అరెస్టు అయిన వ్యక్తి. పలువురు ప్రభుత్వ ఉద్యోగులకు మంత్రి పీఎస్ అంటూ బెదరింపులకు పాల్పడినట్లు నిర్ధారణ అయ్యింది. ఇటీవల పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ చెళ్ళకెరె సబ్ డివిజన్ ఇంజనీర్ కావ్యకు ఫోన్ చేసి మంత్రి ప్రియాంక ఖర్గే పీఎస్‌గా పరిచయం చేసుకున్నాడు. మీకు బదిలీ అవుతోందని కోరుకున్న చోటు కావాలంటే రూ.2లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఆమె నుంచి రూ.80వేలు నగదు తీసుకున్నాడు. డీసీఎం వ్యక్తిగత కార్యదర్శితోపాటు మంత్రి ప్రియాంక ఖర్గే స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ నాగరాజ్‌లు వేర్వేరుగా ఫిర్యాదు చేయడంతో పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు రఘునాథ్ ఎంబీఏ చేశాడు. గతంలోనూ అతడు ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

టాప్ లేపారు..!



పీఎం విశ్వకర్మ రిజిస్ట్రేషన్‌లో రాష్ట్రానికి అగ్రస్థానం

- 5.19 లక్షలమంది అర్హులు
- రాజస్థాన్ కంటే బెళగావి జిల్లాలోనే అత్యధికంగా నమోదు
- 25 కులవృత్తుల ప్రోత్సాహానికే ఈ పథకం
- దేశంలో ఇప్పటివరకు 2.58 కోట్ల దరఖాస్తులు

బెంగళూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కులవృత్తులను ప్రోత్సహించాలని కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పీఎం విశ్వకర్మ పథకాన్ని అమలు చేస్తోంది. 25 సంప్రదాయ కులవృత్తులను ప్రోత్సహించడం, నైపుణ్యత కల్పించడం, అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కేంద్రం గత ఏడాది పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించింది. రిజిస్ట్రేషన్‌లో దేశంలో కర్ణాటక రాష్ట్రమే నెంబరువన్‌గా నిలిచింది. 2023 సెప్టెంబరులో ప్రారంభించిన ఈ పథకాన్ని తొలుత రాష్ట్రాలవారీగా కొన్ని జిల్లాలకే పరిమితం చేశారు. ఆ తర్వాత అన్ని జిల్లాలకు వర్తింపచేశారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 2.58 కోట్ల దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో మూడంచెల పరిశీలన తర్వాత 23.7 లక్షల దరఖాస్తులు అర్హత కల్గినవిగా నిర్ధారించారు. అంతిమంగా ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 10లక్షల మంది ఈ పథకం లబ్ధిదారులు అయ్యారు. 25 సంప్రదాయ వృత్తుల కార్మికులకు నైపుణ్యత, ఇతర సౌకర్యాలను కల్పిస్తారు. అర్హత పొందిన లబ్ధిదారులు సంబంధిత జిల్లా నైపుణ్య శిక్షణా సంస్థలో అల్పావధి శిక్షణలు పొందే వెసులుబాటు ఉంటుంది. శిక్షణాకాలంలో స్టైఫెండ్ ఇస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి రూ.15వేల విలువైన టూల్‌కిట్‌లతోపాటు రూ.లక్ష వరకు రుణ సదుపాయం కల్పిస్తారు. నైపుణ్యం పొందినవారికి బ్యాంకుల ద్వారా రుణం అందిస్తారు. లబ్ధిదారుల రిజిస్ట్రేషన్‌లో రాష్ట్రప్రభుత్వం దేశంలోనే ప్రథమంగా నిలవడం ప్రత్యేకం.

దరఖాస్తుల వివరాలు.. రాష్ట్రాలతోపాటు జిల్లాలు			
రాష్ట్రం	రిజిస్ట్రేషన్	జిల్లా	రిజిస్ట్రేషన్
కర్ణాటక	5.19 లక్షలు	బెళగావి	2.55 లక్షలు
రాజస్థాన్	2.01 లక్షలు	తుమకూరు	1.80 లక్షలు
మహారాష్ట్ర	2.00 లక్షలు	బెంగళూరు	1.75 లక్షలు
గుజరాత్	1.95 లక్షలు	బీదర్	1.55 లక్షలు
మధ్యప్రదేశ్	1.76 లక్షలు	మైసూరు	1.42 లక్షలు
ఆంధ్రప్రదేశ్	1.64 లక్షలు	రాయచూరు	1.40 లక్షలు
జమ్ముకశ్మీర్	1.43 లక్షలు	చిత్రదుర్గ	1.39 లక్షలు
చండీఘడ్	0.98 లక్షలు	ధారవాడ	1.24 లక్షలు
బీహార్	0.84 లక్షలు	దావణగెరె	1.12 లక్షలు
అస్సాం	0.83 లక్షలు	కొప్పళ	1.13 లక్షలు
ఒడిశ్శా	0.82 లక్షలు	కలబురగి	1.03 లక్షలు
తెలంగాణ	0.63 లక్షలు	చిక్కబళ్ళాపుర	1.01 లక్షలు

● రాష్ట్రంలో 28,78,482 అర్జీలు స్వీకరించారు. ఇది దేశంలోనే అత్యధికంగా నమోదు చేసుకున్నట్టయ్యింది. అత్యధికంగా బెళగావి జిల్లాలో 2,55,824 మంది దరఖాస్తు చేసుకోగా కొడగులో అత్యల్పంగా 8899మంది దరఖాస్తు చేశారు.

ఏయే వృత్తులకు వర్తింపు

పీఎం విశ్వకర్మ పథకం ద్వారా కార్పెంటర్‌లు, బోట్‌లు, తెప్పలు తయారీ చేసేవారు, బంగారు, వడ్రంగి, కొలిమి పని, టైలర్‌లు, కుమ్మరులు, బాస్కెట్ తయారీ చేసేవారు, చేనేతలు, పద్మశాలిలు, రజకులు, శిల్పులు, సంప్రదాయక బొమ్మల తయారీ, చర్మకారులు, దర్జీలు, హెయిర్‌స్టైలిస్ట్‌లు, తాపీ మేస్త్రీలు, పూలమాలల తయారీ, మత్స్యకారులకు వలలు సిద్ధం చేసేవారితోపాటు 25 రకాల కులవృత్తులవారికి అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా టైలరింగ్‌కు అత్యధిక దరఖాస్తులు వచ్చిన మేరకు తాత్కాలికంగా ఈ విభాగాన్ని రద్దు చేశారు.

అంతా పచ్చదనమే..!



పచ్చదనంతో కూడిన చెట్లు

'ఉపాధి' ద్వారా పల్లె వనాల అభివృద్ధి

పశుగ్రాసం పెంపకానికి చేయూత

ప్రతి మండలంలో అమలుకు ప్రభుత్వం శ్రీకారం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పల్లెవనాలు (సహజఅడవులు), పశుగ్రాసం పెంపకాన్ని చేపట్టేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉపాధి జాబ్‌కార్డు ఉన్నవారి స్థలాల్లో పశుగ్రాసం పెంపకం చేపట్టనున్నారు. ఇక ప్రతి మండలంలో ప్రభుత్వ భూముల్లో పల్లెవనాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కనీసం 0.25ఎకరాల నుంచి ఎకరం విస్తీర్ణంలో ఈ పల్లెవనాలను అభివృద్ధి చేయనున్నారు. గ్రామాల్లో పచ్చదనం పెంపొందించడానికే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు పూర్తి బాధ్యత ఆయా మండలం ఎంపీడీఓలు, ఉపాధి పథకం ఏపీడీలు, ఏపీఓలు తీసుకుంటారు.

1000

ఎకరాల్లో పశుగ్రాసం సాగు...

జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద వెయ్యి ఎకరాల్లో పశుగ్రాసం పెంపకాన్ని చేపట్టనున్నారు. ప్రతి మండలంలో 25-35 ఎకరాల్లో పశుగ్రాసం సాగుచేయనున్నారు. పాడి ఉత్పత్తుల పెంపే లక్ష్యంగా బహువార్షిక గడ్డిజాతి పెంపకాన్ని చేపట్టనున్నారు. ఉపాధి పథకం కింద జాబ్‌కార్డు, పాడిపశువులు, బోరుబావి, నీటి సదుపాయం ఉన్నవారు పశుగ్రాసం సాగు చేసుకోవచ్చు. ఒక్కో రైతుకు కనీసం 10సెంట్ల నుంచి అర ఎకరా వరకు పశుగ్రాసం పెంచుకోవడానికి అవకాశం ఉంటుంది. వీరికి రెండేళ్ల పాటు పశుగ్రాసం పెంపకానికి అయ్యే ఖర్చును ఉపాధి పథకం కింద చెల్లిస్తారు. రైతుపేరు, భూమి పాసుపుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం, జాబ్‌కార్డు, ఆధార్‌కార్డులతో సమీపంలోని ఉపాధి సిబ్బంది ద్వారా పశుగ్రాసం పెంపకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.



రెండు పనులు ఉపాధి కింద చేపడతాం



ఉపాధి పథకం కింద పచ్చదనం పెంపునకు పల్లెవనాలు, పాడిఉత్పత్తి పెంపునకు పశుగ్రాసం పెంపు పథకాన్ని అమలు చేస్తున్నాం. జిల్లాలో అర్హత కలిగిన ఉపాధి జాబ్‌కార్డుదారులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవచ్చు. పశుగ్రాసం పెంపకానికి రెండేళ్ల పాటు ఉపాధి పథకం కింద నిధులు చెల్లిస్తాం. ఇక పల్లెవనాలు పెంపునకు కూడా ఉపాధి పథకం కింద నిధులు చెల్లిస్తారు.

-సలీం బాషా, డ్వామా పీడీ

పేకాటలో పట్టుబడిన వైసీపీ నాయకులు

ధర్మవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ లాడ్జిలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 10 మంది వైసీపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. దుర్గమ్మగుడి సమీపంలో ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 10 మంది వైసీపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.59 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని, సొంత పూచీకత్తుపై వైసీపీ నాయకులను వదిలిపెట్టారు.

26నుంచి డిగ్రీ మెగా సప్లిమెంటరీ

అనంతపురం సెంట్రల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): డిగ్రీ విద్యార్థులకు 26నుంచి మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్కేయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2015నుంచి సెమిస్టర్ పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. డిగ్రీ కోర్సు మూడు సంవత్సరాల వ్యవధిలో సబ్జెక్టులు పాస్‌కాని విద్యార్థులు మరో మూడేళ్లలో పూర్తిచేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వివిధ కారణాల రీత్యా అనేకమంది విద్యార్థులు సబ్జెక్టులు పెండింగ్‌లో పెట్టుకున్నారన్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని ఈనెల 26 నుంచి డిసెంబరు 23వరకు మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఫీజులు చెల్లించిన ప్రతి విద్యార్థి పరీక్షలకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు వారి కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు.

రైతును ముంచిన మొక్కజొన్న

▼ రోడ్డు మీద పంటను ఆరబెట్టిన రైతులు ▼



శింగనమల నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వేరుశనగ సాగుతో విసిగిపోయిన రైతులు ప్రత్యామ్నాయంగా సాగు చేసిన పంటలతోనూ నష్టపోతున్నారు. శింగనమల మండలంలో నిరంతరం వేరుశనగ సాగుచేసే రైతులు మొక్కజొన్న పంట సాగుచేశారు. దిగుబడి బాగానే వచ్చింది. కానీ ధరలు భారీగా పడిపోవడంతో పెట్టుబడులు కూడా వస్తాయో రావోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 1000 హెక్టార్లలో మొక్కజొన్న పంట సాగు చేశారు. పంట సాగు చేసే సమయంలో క్వింటా ధర రూ3,500 పలికింది. ప్రస్తుతం క్వింటా రూ.2300 నుంచి 2500 వరకు వ్యాపారులు అడుగుతున్నారు. దిగుబడి వచ్చినా ధర తగ్గిపోవడం, నిల్వ చేసుకోవడానికి వీలులేకపోవడంతో కొందరు రైతులు ఉన్న ధరకే అమ్ముకుంటున్నారు. ఏ పంటలు సాగు చేసినా చివరికి నష్టాలే మిగులుతున్నాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి ఆశాజనకం.. ధరలు పతనం



ఈసారీ నష్టాలే : వెంకటరెడ్డి, చిన్నజలాలపురం

నేను ప్రతి సంవత్సరం వేరుశనగ పంట సాగు చేస్తుండేవాడిని. ఈసారి మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. 50 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. పంట కోసం ఇప్పటికే రూ.2లక్షలు ఖర్చు చేశాను. పంటను అమ్మిన రూ.లక్షన్నర లోపే వస్తుంది. ఈసారీ నష్టాలే మిగిలాయి.



దిగుబడి ఉన్నా.. ధర లేదు : రామాంజనేయులు, శింగనమల

నేను నాలుగు ఎకరాల్లో పంట సాగు చేశాను. మా పొలం చెరువు ప్రాంతంలో ఉంది. మూడు నెలల పాటు పంటను ఆడవి పందుల బారి నుంచి రాత్రింబవళ్లు కష్టపడి కాపాడుకున్నాను. దిగుబడి బాగానే ఉన్నా ధర తగ్గిపోవడంతో కొనుగోలు చేసేవారు రాలేదు. గత్యంతరం లేక పంటను గ్రామంలోని దేవాలయం వద్దనే ఆరబెట్టుకున్నా.

గిట్టుబాటు ధర ఏదీ..?



మొక్కజొన్న పంటకు ధరలు పడిపోవడంతో చాలా మంది రైతులు పొలాల్లోనే పంటలను పెట్టుకున్నారు. క్వింటాపై రూ.1000 తగ్గడంతోపాటు పంట కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడంలేదు. ప్రభుత్వం మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి.

- మధుయాదవ్,

రైతు సంఘం, నియోజకవర్గ అధ్యక్షుడు

ఎస్టీ కమిషన్ అదేశాలు

అమలు చేయాలి

ఏబీఎస్ఎస్ సెక్రెటరీ చక్రినాయక్

అనంతపురం సెంట్రల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బంజారాల అభివృద్ధికి 2019లో జాతీయ ఎస్టీ కమిషన్ విడుదల చేసిన ఆదేశాలను అమలు చేయాలని అఖిల భారత బంజారా సేవా సంఘం (ఏబీఎస్ఎస్) రాష్ట్ర కార్యదర్శి బానోత్ చక్రినాయక్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక అభివృద్ధిలో భాగంగా సెల్‌ఫోన్ల వినియోగం పెరిగిందన్నారు. బంజారాల నివాసప్రాంతాలైన తండాలలో సెల్‌టవర్లను ఏర్పాటు చేయకపోవడంతో సిగ్నల్ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బంజారాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఏబీఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. దీంతో 2019లో రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గత ఐదేళ్లలో కమిషన్ ఆదేశాలు మరుగున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం కమిషన్ ఆదేశాలు అమలు చేసి బంజారాల అభివృద్ధిలో భాగం కావాలని విజ్ఞప్తిచేశారు.

విద్యారంగాన్ని సరిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేఎస్ఎస్ ప్రసాద్

యాప్‌ల భారం తగ్గించాలి

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్

ఘనంగా స్వర్ణోత్సవ మహాసభలు

కదిరి అర్బన్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): అస్తవ్యస్తంగా, గందరగోళంగా మారిన విద్యారంగాన్ని కూటమి ప్రభుత్వం సరిదిద్దాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. కదిరి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు పరచిన 117 జీఓ ఫలితంగా విద్యారంగం అస్తవ్యస్తంగా తయారయిందన్నారు. కూటమి ప్రభుత్వం కూడా ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయకుండా, సమయాన్ని యాప్‌ల పనిభారంతో, ఆన్‌లైన్‌వర్క్‌తో వృథా చేస్తోందన్నారన్నారు. 1 నుంచి 5, 6 నుంచి 10 లేక ప్లస్2 వరకు ఉండేలా పాఠశాలలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అపార్ పనిని సరళీకరణ చేసి, గడువు పెంచాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం యూటీఎఫ్ ఎంతో పోరాటం చేసిందని, ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించలేదని అన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

శ్రీసత్యసాయి జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా భూతన్న, అధ్యక్షుడిగా శెట్టిపి జయచంద్రారెడ్డి, సహాధ్యక్షులుగా జీహెచ్ బాబు, పీఎస్ సీతామహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కోశాధికారిగా శ్రీనివాసులుతోపాటు మరో ఎనిమిది మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ రాష్ట్ర కారదర్శి కోటేశ్వరప్ప వ్యవహరించారు.

కార్మికుల జీవనోపాధికి ధరాఘాతం

- ఏఐయూటీయూసీ అఖిల భారత కార్యదర్శివర్గ సభ్యుడు సోమశేఖర్ యాదగిరి



ప్రసంగిస్తున్న సోమశేఖర్ యాదగిరి

అనంతపురం కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకులు, మందులు, పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెరుగుదలతో కార్మికుల జీవనోపాధికి తీవ్ర విఘాతం కలుగుతోందని ఏఐయూటీయూసీ అఖిల భారత కార్యదర్శివర్గ సభ్యుడు సోమశేఖర్ యాదగిరి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం నిర్వహించిన ఏఐయూటీయూసీ రాష్ట్ర మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నేడు మనదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద క్రూర దోపిడీవల్ల కోట్లాదిమంది కార్మికులు ఉపాధి, ఉద్యోగాలు కోల్పోతున్నారన్నారు. నేటి మార్కెట్ సంక్షోభంలో కూడా అత్యధిక లాభాలు గడించడానికి, ప్రపంచ మార్కెట్‌లో తమ ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి పాలస్తీనా, లెబనాన్, ఉక్రెయిన్ దేశాలపై సామ్రాజ్యవాద శక్తులు అన్యాయంగా యుద్ధాలు చేస్తూ లక్షలాదిమంది ప్రజల ప్రాణాలను బలిగొంటున్నాయన్నారు. ఏపీలో కూడా పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం ప్రవేశపెట్టిన గ్లోబలీకరణ, ప్రైవేటీకరణ విధానాలతో లక్షలాదిమంది కార్మికులు, రైతులు జీవనోపాధి కోల్పోతున్నారన్నారు. ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని, ఆర్థిక సమస్యలతో దిక్కుతోచక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను కొనసాగిస్తోంద న్నారు. కార్యక్రమంలో ఎస్‌యూసీఐ(సి) రాష్ట్ర కమిటీ సభ్యుడు రాఘవేంద్ర, ఏఐయూటీయూసీ రాష్ట్ర ఇన్‌చార్జి సుధీర్, అశోక్, ప్రమీల, నాగన్న, రామకృష్ణారెడ్డి, మంజునాథ్, కిశోర్, శేఖర్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి కబుర్లే పట్టించాయి..!

కాల్ డేటా ఆధారంగా దొరికిన ముగ్గురు

రామాంజినమ్మ మృతదేహం లభ్యం..?

అనంతపురం క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న అటెండర్ రామాంజినమ్మ హత్య కేసు ఓ కొలిక్కి వచ్చింది. ఆమెను హత్య చేసిన వారెవరు..? ఎందుకు చంపారో పోలీసులకు స్పష్టత వచ్చింది. కానీ, శనివారం లభించిన మృతదేహం రామాంజినమ్మదా..?కాదా..? అనేది తేల్చాల్సిన బాధ్యత పోలీసులపై పడింది. రామాంజినమ్మ గతనెల 18న అదృశ్యమైంది. నెలాఖరులో కుటుంబ సభ్యులు అనంతపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెలలో కేసు కొంత ముందుకు కదిలింది. కొన్ని సంఘటనల ఆధారంగా పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు తమకేమీ తెలియదని చెప్పుకొచ్చినట్లు సమాచారం. పోలీసులకు ఎట్టకేలకు శనివారం రామాంజినమ్మ ఇంటి సమీపంలో ఓ మహిళ మృతదేహం కనిపించింది. ఆమె ధరించిన చీర, బెడ్‌షీట్, ఇతర ఆనవాళ్లు మృతదేహం ఆమెదేనని స్పష్టం చేస్తున్నాయి. కానీ శరీరం బాగా కుళ్లిపోయి ఉండడంతో ఆ శరీరం ఆమెదేనా..?కాదా..? అనేది తేలాల్సి ఉంది. ఆదివారం వీఆర్ఓ సమక్షంలో పంచనామా చేయించి, అనంతరం పోస్టుమార్టం చేయించారు. ఆ మృతదేహం ఎవరిదనే విషయం తేల్చడానికి డీఎన్ఏ టెస్ట్ చేయించనున్నారు. విజయవాడలో ఆ టెస్ట్ చేయిస్తారు. మరో 10 రోజుల్లో ఆ మృతదేహం ఎవరిదనేది స్పష్టత రానుంది.



అర్ధరాత్రి ఊసులే...

రామాంజినమ్మ అదృశ్యంతో రూరల్ సీఐ శేఖర్ ఆమె ఇంటి నుంచే దర్యాప్తు చేపట్టారు. తొలుత ఎలాంటి క్లూ లభించలేదు. విచారణలో ఎదురుగా నిర్మిస్తున్న కొత్త ఇంటి పనిలో ఉన్న బేల్దారి నుంచి విచారణ ప్రారంభించారు. తొలుత తానేమీ ఫోన్‌లో మాట్లాడలేదని, సీసీ ఫుటేజీలు లేకుండానే తమను ఎలా అరెస్ట్ చేస్తారని చాలా గట్టిగానే ప్రశ్నించినట్లు సమాచారం. ఈ క్రమంలో రెండు నెలల కాల్‌డేటా తీసి చూస్తే స్పష్టత రాలేదు. ఆ తరువాత ఒక సంవత్సరం కాల్ లిస్ట్‌లు, రికార్డులు బయటకు తీసినట్లు సమాచారం. దీంతో రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఆ యువకుడు, రామాంజినమ్మ మాట్లాడిన ఊసు కబుర్లన్నీ బయటపడ్డాయి. అదుపులోకి తీసుకున్న వ్యక్తులు చాలా ధీమాతో ఉన్నట్లు తెలుస్తోంది. శవం దొరికితే కదా అన్నట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. చూడాలి మరి రామాంజినమ్మ హత్యకేసు ఎలాంటి మలుపులు తిరుగుతుందో..?

బాలికల టెన్నికాయిట్ విజేత 'అనంతపురం'

ముగిసిన 68వ అంతర్ జిల్లా స్కూల్ గేమ్స్ పోటీలు

చింతలపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా చింతలపూడిలో ఈనెల 9, 10 తేదీల్లో ప్రభుత్వ హైస్కూలులో జరిగిన రాష్ట్ర 68వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ టెన్నికాయిట్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. 13 జిల్లాల నుంచి బాలురు, బాలికలు 390 మంది పాల్గొన్నారు. 78 జట్లు లీగ్ నాకౌట్ పద్ధతిలో పోటీపడ్డాయి. దీనిలో అండర్-19 బాలికల విభాగంలో అనంతపురం ప్రథమ, తూర్పుగోదావరి ద్వితీయ, చిత్తూరు తృతీయ స్థానాలు పొందాయి. అండర్-17 బాలికల విభాగంలో అనంతపురం ప్రథమ, తూర్పుగోదావరి ద్వితీయ, పశ్చిమ తృతీయ స్థానాలు పొందాయి. అండర్-14 బాలికల విభాగంలో పశ్చిమ ప్రథమం, విజయనగరం ద్వితీయ, అనంతపురం తృతీయ స్థానాలు పొందాయి.

బాలుర విభాగంలో.. అండర్-19లో పశ్చిమ ప్రథమ, విజయనగరం ద్వితీయ, శ్రీకాకుళం తృతీయ, అండర్-17 బాలుర విభాగంలో ప్రథమ తూర్పుగోదావరి, ద్వితీయ విశాఖ పట్టణం, తృతీయ అనంతపురం సాధించాయి. అండర్-14 బాలుర విభాగంలో అనంతపురం ప్రథమ, పశ్చిమ ద్వితీయ, తూర్పుగోదావరి తృతీయ స్థానాలు సాధించాయి. విజేతలకు మాజీ స్పోర్ట్స్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ పేరం రవీంద్రనాథ్, పోటీల పరిశీలకులు ఎస్.టి.ప్రసాద్, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి కె.అలివేలుమంగ, కె.రమేష్, కె.సురేష్‌కుమార్, హెచ్‌ఎం పి.సుధాక రరావు, పిట్టా వేణు, మాటూరి చక్రధరరావు, అల్లూరి గిరిరాజు తదితరుల చేతుల మీదుగా మెమెంటోలు, బహుమతులు అందజేశారు.

గెలుపే లక్ష్యంగా పరుగెత్తాలి

- **యువతకు పిలుపునిచ్చిన కడప జేసీ అదితిసింగ్**
- **అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ప్రారంభం**

కడప స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరైన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ఆత్మవిశ్వాసంతో పరుగెత్తాలని జేసీ అదితిసింగ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జిల్లా స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్‌ఏ) స్టేడియంలో వేకువజామున 3 గంటలకు ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఎంపికలు సంబంధిత రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నన్ పునీత్ అధ్యక్షతన ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేసీ అదితిసింగ్ హాజరై మొదటి దశ పరుగును జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఇర్విన్, కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రాకేశ్‌చంద్, అనుబంధ సంఘాల అధికారులు పాల్గొన్నారు. కాగా.. కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి 4000 మంది అభ్యర్థులు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరు కానున్నారు.

అమిగోస్ ఎండీపై చర్యలు తీసుకోండి

వైసీపీ సమావేశాలకు మైనింగ్ సొమ్ము

మైన్స్ లీజు కాంట్రాక్టర్ రాజేష్



అమిగోస్ సంస్థ ప్రసాద్‌రెడ్డి వైసీపీ సమావేశాల్లో పాల్గొన్న ఫొటోలను చూపుతున్న రాజేష్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనేక అక్రమాలకు పాల్పడిన అమిగోస్ మినరల్స్ సంస్థ ఎండీ ప్రసాద్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మైన్స్ లీజు కాంట్రాక్టర్ రాజేష్ ప్రభుత్వాన్ని కోరారు. తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అమిగోస్ మినరల్స్ సంస్థ ఎండీ ప్రసాద్‌రెడ్డి మాజీ సీఎం జగన్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి చేసిన అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఫొటోలను విడుదల చేశారు. రాజేష్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో వైసీపీ అండతో ఖనిజ సంపదను అమిగోస్ కొల్లగొట్టిందని ఆరోపించారు. అమిగోస్ ప్రసాద్‌రెడ్డి ఆగడాలకు సంబంధించిన అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వడం, చెక్‌పోస్టులు పెట్టి, బెదిరించి మైనింగ్ లీజ్ కాంట్రాక్టర్ల నుంచి కోట్లాది రూపాయల వసూళ్లకు పాల్పడ్డారని విమర్శించారు. మైనింగ్‌లో సంపాదించిన సొమ్మును కళ్యాణదుర్గం, మడకశిర, హిందూపురం నియోజకవర్గాల్లో సమావేశాల నిర్వహణ, వైసీపీకి ఎన్నికల్లో వినియోగించారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో మైన్స్ లీజ్ కాంట్రాక్టర్లను బెదిరించి, కేసులు పెట్టి వేధించారని తెలిపారు. ఎంతో మంది మైన్స్ లీజు కాంట్రాక్టర్లను నష్టపరిచి సొమ్ము దోచుకున్నారని ఆరోపించారు. అమిగోస్ ప్రసాద్‌రెడ్డి దోచుకున్న ఖనిజసంపదను కక్కించాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్‌ను కలిసి వివరిస్తానని తెలిపారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

ప్రధాన రహదారి పక్కన మట్టికుప్పలు

చోద్యంచూస్తున్న అధికారులు

చెరువులోని మట్టిని తవ్వుతున్న దృశ్యం



గాండ్లపెంట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారి పక్కనే వున్న చెరువులో వైసీపీ నాయకుడు మట్టిని తవ్వేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాండ్లపెంట మండలంలోని కదిరి - రాయచోటి ప్రధాన రహదారి పక్కనే ఉన్న కోటపల్లి చెరువులో గత మూడు రోజుల నుంచి జేసీబీతో మట్టిని తవ్వేస్తూ ట్రాక్టర్లతో సొంత భూమిలోకి తరలిస్తున్నారు. ప్రధాన రహదారిలోని నీరు పొలంలోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేసుకుంటున్నాడు. రోడ్డు పక్కన చెరువులోని బంకమట్టి తోలడంతో వర్షా కాలంలో వాహనాలు పక్కకు వెళితే కురుకుపోయే ప్రమాదం ఉందని వాహనదారులు వాపోతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నాడని తెలుస్తోంది. ఇప్పటికే చెరువు కట్ట సమీపంలో మట్టి తవ్వడంతో కట్ట కూడా దెబ్బతినే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో మట్టిని ఇష్టానుసారంగా తరలిస్తున్నాడు. ప్రధాన రహదారిలోనే యథేచ్ఛగా మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ప్రధాన రహదారి పక్కన వదిలిన మట్టి కుప్పలు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంట్...

దోస్తోయెవ్‌స్కీ (జయంతి)



టాల్‌స్టాయ్‌తో కలసి రష్యన్ స్వర్ణయుగం నాటి ప్రముఖ రచయిత ఫ్యోదోర్ మిఖైలోవిచ్ దోస్తోయెవ్‌స్కీ 1821 నవంబరు 11న జన్మించారు. తత్వవేత్త, చిన్నకథల రచయిత, వ్యాస రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలి. పాత్రికేయుడిగా మానవ సంబంధాలు, మనస్తత్వంతో కూడిన రచనలు చేశారు. ఆయన రచనలు 170కుపైగా భాషలలో అనువాదమై కోట్లాది కాపీలు అమ్ముడయ్యాయి. ఇది ప్రపంచ సాహిత్యంలో ఒక రికార్డుగా నిలిచింది. 1881 ఫిబ్రవరి 9న కన్నుమూశారు. ఆయన నవలలు రాసిన అపార్ట్‌మెంట్‌ను మ్యూజియంగా తీర్చి 1971లో తెరిచారు.

ఉస్తాద్ కరీంఖాన్ (జయంతి)




శాస్త్రీయ సంగీతంలో కిరానా ఘరానాకు ఆద్యులైన ఉస్తాద్ అబ్దుల్ కరీంఖాన్ 1872 నవంబరు 11న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం షమ్లి జిల్లా కిరానాలో జన్మించారు. గాయకుడే కాక వీణ, సారంగి వాద్యాలాపనలో నిష్ణాతులు. మైసూరు ప్యాలెస్‌లో పలు కచేరీలు ప్రదర్శించారు. 'సంగీత రత్న' బిరుదు పొందారు. హిందూస్తానీ సంగీతాన్ని దక్షిణాదికి పరిచయం చేసిన ఘనత ఆయనదే. త్యాగరాజ కృతులకు సంగీతం సమకూర్చారు. 1937 అక్టోబరు 27న కన్నుమూశారు.

ఆచార్య జేబీ కృపలాని (జయంతి)



ఆచార్య జీవత్‌రామ్ భగవాన్‌దాస్ కృపలాని 1888 నవంబరు 11న జన్మించారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, రాజకీయ నాయకుడు, పర్యావరణ వేత్త. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. స్వాతంత్ర్యానంతరం 1947లో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా, ఏఐసీసీ జనరల్ సెక్రటరీగా పార్టీ బలోపేతానికి కృషి చేశారు. 1982 మార్చి 19న కన్నుమూశారు. మరణానంతరం 22ఏళ్లకు ఆయన ఆటోబయోగ్రఫీ 'మై టైమ్స్' విడుదలైంది. 1989లో ప్రత్యేక పోస్టల్‌స్టాంప్ విడుదలైంది.

గోవిందరాజులు సుబ్బారావు (జయంతి)



డాక్టర్ గోవిందరాజులు సుబ్బారావు 1895 నవంబరు 11న జన్మించారు. తొలితరం తెలుగు నాటకరంగ, సినీరంగ నటుడు. పౌరాణిక, చారిత్రక, సాంఘిక సినిమాలలో నటించారు. ఓవైపు వైద్యం అందిస్తూనే మరోవైపు నటనలోనూ సత్తా చాటుకున్నారు. మాలపిల్లలో సుందరరామశాస్త్రి పాత్రలోనూ, 'బాలనాగమ్మ'లో మాయల మరాఠిగా, పల్నాటియుద్ధంలో బ్రహ్మనాయుడు పాత్రలలో పేరొందారు. 1959 అక్టోబరు 29న కన్నుమూశారు.

జానీ వాకర్ (జయంతి)




ప్రముఖ హాస్యనటుడు జానీ వాకర్ 1926 నవంబరు 11న ఇండోర్‌లో జన్మించారు. అసలు పేరు. బద్రుద్దీన్ జమాలుద్దీన్ ఖాజీ. దర్శకుడు గురుదత్ ఆయనకు తాగుబోతు పాత్రకోసం 'జానీవాకర్'గా పేరు పెట్టారు. 300కుపైగా సినిమాలలో నటించారు. సెక్రటరీ, మేనేజర్ తదితర పాత్రల్లో నటించారు. ఆయన కోసం ప్రత్యేకంగా రాసిన పాటలను మహ్మద్‌రఫీ ఆలపించారు. ఉత్తమ కమెడియన్, సపోర్టింగ్ యాక్టర్ అవార్డులు పొందారు. 2003 జూలై 29న కన్నుమూశారు.

మాడపాటి హనుమంతరావు (వర్ధంతి)



'ఆంధ్ర పితామహ'గా పేరొందిన మాడపాటి హనుమంతరావు 1885 జనవరి 22న కృష్ణా జిల్లా నందిగామ తాలూకా పొక్కునూరులో జన్మించారు. రచయిత, రాజకీయనాయకుడు. ఆంధ్ర జనసంఘం, ఆంధ్రమహాసభ వంటి ప్రజాసంఘాల స్థాపనలోనూ, నిర్వహణలోనూ కీలకపాత్ర వహించారు. 1952లో శాసనసభకు పోటీ చేసి ఓడిపోయారు. హైదరాబాద్ నగరానికి తొలి మేయర్ పదవిని ఆయనే అధిష్ఠించారు. పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. 1970 నవంబరు 11న కన్నుమూశారు.

డాక్టర్ కువెంపు (వర్ధంతి)




కన్నడ రాష్ట్ర గేయం 'జయభారత జననీ తనూజాతె' రచించిన, కన్నడ సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ పురస్కార గ్రహీత కుప్పళి వెంకటప్ప పుట్టప్ప (కువెంపు) 1904 డిసెంబరు 29న జన్మించారు. వరకవి బేంద్రెచే 'యుగద కవి జగద కవి'గా పిలవబడ్డారు. సాహితీ సేవలకు 'రాష్ట్ర కవి', 'కర్ణాటక రత్న' పురస్కారాలు పొందారు. పద్మ విభూషణ్ తదితర పురస్కారాలు పొందారు. 1994 నవంబరు 11న కన్నుమూశారు.

బోనీ కపూర్ (పుట్టినరోజు)



బాలీవుడ్‌లో పేరొందిన నిర్మాత బోనీకపూర్ 1955 నవంబరు 11న జన్మించారు. ఆయన నిర్మించిన 'మిస్టర్ ఇండియా' సినిమా 100 గ్రేటెస్ట్ ఇండియన్ ఫిల్మ్స్‌లో ఒకటిగా నిలిచింది. ఆయన రూపొందించిన దాదాపు అన్ని సినిమాలు బాక్సాఫీస్ హిట్ అయ్యాయి. ప్రముఖ నటి శ్రీదేవిని 1996లో పెళ్లి చేసుకున్నారు. బాలీవుడ్‌కు కొత్తనటులను పరిచయం చేశారు.

లియోనార్డో డికాప్రియో (పుట్టినరోజు)



'టైటానిక్' సినిమాతో అంత ర్జాతీయ గుర్తింపు పొంది నటుడిగా, నిర్మాతగానూ రాణించి, హాలీవుడ్‌లో అత్యధిక రెమ్యూనరేషన్ పొందుతున్న లియోనార్డో డికాప్రియో 1974 నవంబరు 11న లాస్ ఏంజెల్స్‌లో జన్మించారు. బయోపిక్స్‌తోపాటు అసాధారణ పాత్రలలో నటించారు. బాఫ్టా, అకాడమీ, 3 గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌తోపాటు పలు పురస్కారాలు పొందారు. స్వచ్ఛంద సంస్థతో సమాజసేవ అందిస్తున్నారు.

కన్నడ సంస్కృతి భావితరాలకు అందించాలి

బెంగళూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కన్నడ భాషకు రెండువేల సంవత్సరాలకుపైగా చరిత్ర ఉందని భావితరాలకు భాషా సంస్కృతి అందించాల్సిన అవసరం ఉందని విద్యావాచస్పతి డాక్టర్ అరళుమల్లిగె పార్థసారథి అభిప్రాయ పడ్డారు. శ్రీకృష్ణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 69వ కన్నడ రాజ్యోత్సవ వేడుకలు చైర్మన్ డాక్టర్ రుక్మాంగద నాయుడు అధ్యక్షతన జరిగాయి. ప్రముఖ సాహితీవేత్తలు శ మం కృష్ణరాయ ముఖ్యులుగా పాల్గొన్నారు. అరళుమల్లిగె మాట్లాడుతూ కన్నడనాడును రాజుల పాలనలోనే ప్రాచుర్యంలో ఉందన్నారు. విజయనగర సామ్రాజ్యంలో పలు శాసనాలు, కృతులకు రూపం దక్కిందన్నారు. కన్నడ భాష మనుగడకోసం ప్రస్తుత తరుణంలో పోరాటం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ముఖ్యులకు చైర్మన్‌తో పాటు పీజీ విభాగం డైరెక్టర్ వేణుగోపాల్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కమలా సుగంధి, డైరెక్టర్ మనోహర్ తదితరులను సత్కరించారు.



కన్నడ రాజ్యోత్సవంలో డాక్టర్ అరళుమల్లిగె పార్థసారథి తదితరులు

మస్తేనహళ్లిలో కన్నడ రాజ్యోత్సవం



కన్నడరాజ్యోత్సవంలో పాల్గొన్న పంచాయతీ సిబ్బంది తదితరులు

చింతామణి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చింతామణి తాలూకాలోని కైవార హోబళి మస్తేనహళ్ళి గ్రామ పంచాయతీ కేంద్రంలో కన్నడ రాజ్యోత్సవం ఘనంగా జరిగింది. శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో గ్రామపంచాయతీ అధ్యక్షురాలు ఎస్ఎం రోజా నేతృత్వంలో కన్నడ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సరిహద్దులోని జిల్లాలు, రాష్ట్రాలవారు పలు పనుల నిమిత్తం రాష్ట్రానికి వస్తుంటారని వారికి కన్నడ నేర్పించడం ద్వారా కన్నడమాత భువనేశ్వరిదేవి ఘనతను పెంచాలన్నారు. జంగమసీగేహళ్ళి ముని నారాయణప్ప మాట్లాడుతూ కన్నడిగులు ఎవరికీ తీసిపోరని, తాము స్వాభిమానులమని ప్రతి ఒక్కరినీ గౌరవిస్తామన్నారు. జీవనోపాధికోసం వచ్చేవారిని అన్నదమ్ముల్లా ఆదరిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సభ్యుడు వెంకటేష్, పిఎన్ రాజగోపాల్, గుట్టహళ్ళి మంజునాథ్, కృష్ణప్ప, అరుణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడుపరాదు

శిడ్లఘట్ట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 18ఏళ్లలోపువారు వాహనాలు నడపడం చట్టరీత్యానేరమని న్యాయాధికారి మొహమ్మద్ రోషన్‌షా అభిప్రాయ పడ్డారు. తాలూకాలోని హనుమంతపుర గేట్ వద్ద బిజిఎస్ కళాశాలలో జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని తాలూకా న్యాయ సేవల సమితి, న్యాయవాదుల సంఘం, పోలీసుశాఖ, విద్యాశాఖ సంయుక్తంగా శనివారం ఏర్పాటు చేసిన చైతన్య కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లా డారు. చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ద్విచక్ర, నాలుగుచక్రాల వాహనాలు నడపరాదన్నారు. కాగా మైనర్లకు వాహనాలు నడిపేందుకు అవకాశం ఇచ్చి మీరు శిక్షకు గురి కారాదన్నారు. తాలూకా న్యాయ సేవా సమితి ద్వారా లభించే న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధాన సివిల్ న్యాయాధికారి జె పూజా, న్యాయవాదుల తాలూకా సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి, కళాశాల ప్రిన్సిపాల్ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో న్యాయాధికారి మొహ్మద్ రోషన్‌షా తదితరులు

ఝాన్సీ మైదానంలో క్రీడాపోటీలు



పోటీల్లో కరాటే విద్యార్థుల ప్రదర్శన

చింతామణి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఉత్తమ ఆరోగ్యం కోసం దైనందిన జీవితంలో కొంత సమయం వ్యాయామం, క్రీడా పోటీల్లో పాల్గొనాలని నవీన్ విద్యాకేంద్ర సంస్థ అధ్యక్షుడు ఏఎస్ మురళి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని అంజని లే అవుట్‌లో నవీన్ విద్యాకేంద్రం ఆధ్వర్యంలో ఝాన్సీరాణి లక్ష్మీబాయి మైదానంలో 2024 వార్షిక క్రీడా పోటీలకు అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యార్థులు బాల్యంనుంచే ఎక్కువ కూరగాయలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ వంటివి ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని అభిప్రాయపడ్డారు. ఉన్నతలక్ష్యాలను అందుకునేందుకు శ్రమించాలన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం ప్రవీణ్ మాట్లాడుతూ ఆటలాడేవేళ గాయాలు తగిలే అవకాశం ఉందని కనీస జాగ్రత్తలు పాటించాలన్నారు. బీఈఓ కార్యాలయ టీపీఓ ఫక్రుసాబ్ మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకోసం జాతీయ స్థాయిలో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో 2శాతం రిజర్వేషన్ ఉంటుందన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొన్న జాతీయ క్రీడాకారులు ఆర్‌డి మంజునాథ్, సీనియర్ క్రీడాకారుడు చౌడప్ప, నవీన్ విద్యాకేంద్రం కార్యదర్శి విఎం రామ్యక్కమ్మ, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు కోదండరామయ్య, కరాటే ట్రైనర్ అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాగిముద్ద ఆరగింపు పోటీలు

» హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో ఇదే తొలిసారి





ఫలితాలను ప్రకటిస్తున్న అనిల్‌రెడ్డి, పోటీల పరిశీలన

బొమ్మనహళ్ళి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక హెచ్ఎస్ఆర్ లే అవుట్ పరంగిపాళ్యలో రాగిముద్ద, నాటుకోడి పులుసు ఆరగించే పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. కర్ణాటక సువర్ణ సంభ్రమ 50ఏళ్లను పురస్కరించుకుని పోటీలు నిర్వహించారు. ప్రథమస్థానంలో దావణగెరెకు చెందిన యోగేశ్, వైట్‌ఫీల్డ్‌కు చెందిన సౌమ్య నిలిచారు. దావణగెరె, రామనగర, కుణిగల్, మాలూరు సహా రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాలనుంచి పోటీల్లో పాల్గొన్నారు. పురుషుల విభాగంలో దావణగెరెకు చెందిన యోగేశ్ 13 రాగిముద్దలు ఆరగించి ప్రథమస్థానంలో నిలిచి పొట్టేలును బహుమతిగా పొందారు. మహిళల విభాగంలో వైట్‌ఫీల్డ్‌కు చెందిన సౌమ్య 9 రాగిముద్దలు తిని 32 ఇంచీల టీవీని బహుమతిగా దక్కించుకున్నారు. పురుషుల విభాగంలో బెంగళూరుకు చెందిన శ్రీనివాసరెడ్డి, కుణిగల్‌కు చెందిన లోకేశ్‌లు వరుసగా ద్వితీయ, తృతీయ స్థానంలో నిలవగా మహిళల విభాగంలో చంద్రకళకు మిక్సీ, మరో మహిళకు కిచెన్ సెట్ దక్కాయి. కాంగ్రెస్ ప్రముఖుడు, సినీ నిర్మాత ఉమాపతి శ్రీనివాసగౌడ, ఎమ్మెల్సీ రామోజిగౌడ, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వివేక్‌రెడ్డి, స్థానిక కాంగ్రెస్ ప్రముఖుడు నారాయణగౌడ, వాసుదేవరెడ్డి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. నిర్వాహకులు అనిల్‌రెడ్డి మాట్లాడుతూ రాగిముద్ద పోటీలు సాధారణంగా మండ్య ప్రాంతంలో ఎక్కువగా నిర్వహిస్తారని ఇదే తొలిసారిగా బెంగళూరు హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వచ్చే ఏడాది నవంబరు 16న పోటీలు నిర్వహించే ఆలోచన ఉందన్నారు. పోటీలను వీక్షించేందుకు విచ్చేసినవారికి కూడా ముద్ద, నాటుకోడి పులుసు, బిరియాని సమకూర్చారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు టీ వాసుదేవరెడ్డి, రవీంద్ర, న్యూల్ వాసుదేవరెడ్డి, అశ్వత్థనారాయణ, లోకేశ్ రెడ్డి, మధు, జయరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు క్షేత్రంగా తారానగర్ బస్టాండ్..!

బళ్లారి సిటీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సండూరు తాలూకా తారానగర్‌లో లక్షలాది రుపాయలతో నిర్మించిన బస్టాండ్ ప్రయాణికుల సౌకర్యార్థం ఉపయోగపడకుండా రైతు క్షేత్రంగా మారింది. సండూరు నుంచి వచ్చే బస్సులు గ్రామ రహదారిపై ఆపి ప్రయాణికులను ఎక్కించుకుని దించేవారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తలెత్తుతాయి. దీనికితోడు ప్రయాణికులకు అసరా లేదు. వర్షం, ఎండ నుంచి ప్రయాణికులను రక్షించేందుకు బస్టాండ్ నిర్మించాలని గ్రామానికి చెందిన మేటి దొడప్ప, అతని పిల్లలు రవాణా శాఖకు విరాళంగా ఇచ్చి, బస్‌స్టేషన్ నిర్మించాలని కోరారు. దీన్ని నిర్మించి ఏడాది కావస్తున్నా ప్రయాణికులు వినియోగించుకోలేదు. ఎందుకంటే బస్టాండుకు బస్సులు రావు. ఇంతకు ముందులా రోడ్డు మీద నిలుపుతున్నారు. ఈ బస్టాండ్‌ను వినియోగించుకునేలా అధికారులు బస్సు డ్రైవర్లను కచ్చితంగా ఆదేశించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఊర్లో మరోచోట స్టాప్ నిలిపి వేయాలని ఆదేశిస్తే బస్టాండును వినియోగించుకోవచ్చని వారు చెబుతున్నారు.



బస్టాండ్‌లో వరి ధాన్యం ఆరబెట్టిన దృశ్యం

ఉత్సాహంగా శారీ రన్

బెంగళూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): టాటా ఉత్పత్తి తనీరా, బెంగళూరుకు చెందిన ఫిట్‌నెస్ కంపెనీ జెజె యాక్టివ్‌లు సంయుక్తంగా ఆదివారం ఏర్పాటు చేసిన శారీ రన్ ఉత్సాహంగా సాగింది. బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వి సూర్య తనీరా సంస్థ సీఈఓ అంబుజ్ నారాయణ్, జేజే యాక్టివ్ కోచ్ ప్రమోద్‌లు జెండా ఊపి ప్రారంభించారు. ఆధునిక మహిళ మరింత శక్తివంతంగా సమాజంలో ఎదగాలనేది మా ఉద్దేశ్యమని తనీరా సీఈఓ అంబుజ్ నారాయణ్ తెలిపారు. చీర ధరించి కూడా పరుగు తీయవచ్చునని నిరూపించామన్నారు. ఎనిమిదేళ్ల క్రితం శారీరన్ ప్రారంభించామని ఏటా పాల్గొనేవారి సంఖ్య పెరుగుతుండడం సంతోషకరమన్నారు. జయనగర్ శాలిని గ్రౌండ్స్‌లో పరుగుల పోటీలో పాల్గొన్నవారితోపాటు కుటుంబ సభ్యులు, స్థానికులతో సందడి అనిపించింది.





శారీరన్‌లో సందడి

హత్య కేసులో నిందితుల అరెస్టు

మడకశిరటౌన్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): తుమకూరు ప్రాంతానికి చెందిన మోహన్‌కుమార్ అనే వ్యక్తి హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలోని సీఐ కార్యాలయంలో హత్యకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. 2023 ఆగస్టు 23న నాగరత్నమ్మ తన పెద్ద కుమారుడు మోహన్‌కుమార్ (52) కనిపించలేదని తుమకూరులోని జయనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మోహన్‌కుమార్ భార్య కవిత.. అక్తర్‌పాషా అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. విషయం భర్తకు తెలియడంతో గొడవపడ్డారు. అక్తర్‌పాషా సహకారంతో కవిత తుమకూరు పట్టణంలో హోటల్‌ను ఏర్పాటు చేసుకుంది. అక్కడికి వెళ్లి భర్త మోహన్‌కుమార్ గొడవపడ్డాడు. దీంతో ఎలాగైనా భర్త అడ్డు తొలగించుకోవాలని కవిత నిర్ణయించుకుంది. తన కుమారుడు కౌశిక్, ప్రియుడు అక్తర్‌పాషా, హోటల్లో పనిచేసే మోహన్‌ప్రసాద్ కలిసి పథకం రచించారు. మోహన్‌కుమార్‌ను హోటల్‌కు పిలిపించి బిర్యానీలో నిద్రమాత్రలు కలిపి తినిపించారు. రాత్రి దాదాపు 10.30 గంటల సమయంలో కత్తిలో గొంతు కోసి హత్యచేశారు. మృతదేహాన్ని మడకశిర మండలం కదిరేపల్లి సమీపంలో రోడ్డు పక్కనే హంద్రీనీవా కాలువలో పడేసి వెళ్లారు. అప్పటి సీఐ సురేష్‌బాబు దర్యాప్తు కొనసాగించారని, తిరిగి సీఐగా వచ్చిన రాజ్‌కుమార్, గుడిబండ ఎస్ఐ మునిప్రతాప్ నిందితులను శనివారం అదుపులోకి తీసుకొన్నట్లు డీఎస్పీ వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

సాహిత్యంపట్ల జిజ్ఞాస పెరగాలి

» విద్యార్థులకు కంబార పిలుపు



జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ చంద్రశేఖర్ కంబార తదితరులు

బెంగళూరు, నవంబరు10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో సాహిత్యం పట్ల జిజ్ఞాస పెరగాలని జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ చంద్రశేఖర్ కంబార అభిప్రాయపడ్డారు. నేషనల్ కళాశాలలో సాహిత్య హబ్బను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కన్నడలో సాహితీవేత్తలకు కొదవ లేదన్నారు. పుస్తకపఠనం తగ్గిపోతుండడం విచారకరమన్నారు. ప్రముఖ రచయిత్రి కేఆర్ సంధ్యారెడ్డి జానపద సాహిత్యం చరిత్ర, తత్వాలు అనే అంశంపై ప్రసంగిస్తూ సీతను అపహరించిన రావణుడు ఆమెపట్ల గౌరవంగా వ్యవహరించారన్నారు. రాముడు అగ్ని ప్రవేశం చేయించారనే అంశాలపై భిన్నమైన వాదనలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మంటెస్వామి జానపద గేయాలను మైసూరుకు చెందిన తంబూరి శివణ్ణ ఆలపించారు. నినాసం కళాకారుల బృందం ఆనె డాక్టర్, సుధాకర్ జైన్ బృందం తాళానికి అనుగుణంగా వాయించారు. కళాశాల చైర్మన్ హెచ్ఎన్ సుబ్రమణ్య, కార్యదర్శి వెంకటశివారెడ్డి పాల్గొన్నారు.

నిమ్మనపల్లి అభివృద్ధికి పాటుపడతాం



శాపురం కుటుంబీకుల బృందం ఇలా..

బెంగళూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లి అభివృద్ధి కోసం పాటుపడదామని మన పూర్వీకుల స్వగ్రామంలో పాఠశాలకు మౌలిక సదుపాయాలు, పేదలకోసం చేయూతనిద్దామని శాపురం కుటుంబీకులు తీర్మానించారు. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లిలో 1950యేట శాపురం రామకృష్ణయ్య 1950 నివసించేవారు. ఆయన వారసులు బెంగళూరు, హైదరాబాద్‌తో పాటు దేశవిదేశాలలో స్థిరపడ్డారు. ప్రస్తుతం 7-9 తరాలకు చెందిన 250మంది కుటుంబీకులు ఆదివారం నగరంలో కలిశారు. ఉద్యోగ, వ్యాపారాల కోసం ఎక్కడ స్థిరపడినా మనమూలమైన సొంతూరు నిమ్మనపల్లిని మరవరాదని రామకృష్ణయ్య కుమారుడు 84ఏళ్ల రామనాథ్ మేలుకలయికలో అభిప్రాయపడ్డారు. నిమ్మనపల్లిని సందర్శించి అవసరమైన సౌలభ్యాలపై ఒక తీర్మానం చేసి సమష్టిగా నిర్ణయం తీసుకుందామన్నారు. 20ఏళ్ల నుంచి 80ఏళ్లమధ్యన ఉండే శాపురం కుటుంబీకులు శ్రీనాథ్ సహా పలువురు భాగ స్వామ్యులయ్యారు.

సంపు అక్రమ నిర్మాణంపై నోటీసులు

బంగారుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బంగారుపేట పట్టణంలోని శాంతినగర్‌లో మోహన్‌సింగ్ అనే వ్యక్తి రోడ్డుపై నీటి సంపును అక్రమంగా నిర్మించినట్లు గుర్తించిన పురసభ అధికారులు నోటీసు జారీ చేశారు. అయినా సదరు వ్యక్తి స్పందించలేదని తెలుస్తోంది. మోహన్ సింగ్ అనే వ్యక్తి రోడ్డుపై సంపును అక్రమంగా నిర్మించడంతో చుట్టుపక్కల ఇంటిగోడలు దెబ్బతింటున్నాయని శ్రీనివాసమూర్తి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. రెడ్డెప్ప అనే వాటర్‌మన్ సహకారంతో అనధికారికంగా వాటర్ కనెక్షన్ పొందినట్లు తెలుస్తోందన్నారు. సదరు వ్యక్తికి నోటీసు ఇచ్చినా స్పందన లేకపోవడంపై స్థానికులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పురసభ అధికారులు తగిన చర్యలు తీసుకుని అక్రమంగా నిర్మించిన సంపును తొలగించాలని కోరుతున్నారు.

పట్టువ్యాపారి ఇంట్లో చోరీ


చింతామణి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణ శివారు ప్రాంతం చిన్నసంద్ర గ్రామంలోని పట్టు వ్యాపారి షఫి ఇంట్లో దొంగలు పడి నగదు, నగలు చోరీ చేశారు. సుమారు 7 లక్షల రూపాయల విలువైన బంగారు, వెండి నగలు చోరీకి గురయ్యాయి. షఫి కుమార్తె పర్వీన్‌తాజ్ బెంగళూరులో ఉంటోంది. ఇటీవల కొడుకుకు జన్మనివ్వడంతో చిన్నారికోసం దంపతులు బెంగళూరుకు వెళ్లారు. బెంగళూరులో ఉంటోన్న షఫి కుమారుడు ఫాజుల్లా అప్పుడప్పుడు వచ్చి వెళ్లేవాడు. శనివారం రాత్రి ఎవరూ లేని వేళ దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు చింతామణి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన అఖండ భజన



పాటలు పాడుతున్న విద్యార్థులు

పుట్టపర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి జయంతి వేడుకల సందర్భంగా చేపట్టిన ముందస్తు అఖండ భజన ఆదివారం రాత్రి 6గంటలకు ముగిసింది. శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన అఖండ భజన 24 గంటల పాటు నిరంతరంగా కొనసాగి సాయంత్రం 6 గంటలకు మంగళహారతితో ముగిసింది. ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంతులో మంగళహారతితో అఖండ భజన ముగించి భక్తులకు ప్రసాదాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,604.07
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	10,601	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,241	10,422
నీటి నిల్వ (టీఎంసీలు)	101.77	27.25

విశిష్ట సేవకులను గౌరవించడం శ్లాఘనీయం

● సాహితీవేత్త బాబు భండారిగల్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బాబు భండారిగల్

రాయచూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశిష్టసేవలందించిన వారిని గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని సాహితీవేత్త బాబు భండారిగల్ అన్నారు. జిల్లాలో కన్నడ ప్రేమికులు, కన్నడ బాషాభివృద్ధి కోసం సేవలందిస్తున్న వారిని గుర్తించి ప్రోత్సహిస్తున్న బషీర్ హోసమని సేవలు ఆయన మార్గం అనుసరణీయమన్నారు. ప్రకాశ్ పబ్లిషర్స్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కన్నడ భవన్‌లో కన్నడ రాజ్యోత్సవ నృపతుంగ ప్రశస్తి ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. బాబు భండారిగల్, బషీర్ హోసమని మాట్లాడుతూ కన్నడ నేల, నీరు, సంస్కృతే తన ఊపిరిగా భావిస్తూ భాషాభివృద్ధి కోసం చేస్తున్న సేవ ప్రశంసనీయమని, అలాంటివారు సమాజంలో అరుదుగా ఉంటారన్నారు. తనకొచ్చే ఆదాయంలో కొంత భాగం సామాజిక సేవ కోసం వినియోగించడం ఆయన ఔదార్యానికి కన్నడిగుల పట్ల ఆయనకున్న మమకారానికి ప్రతీక అన్నారు. అలాంటి వారితో కలిసి నడవడం వారికి తగిన తోడ్పాటునందించడం ప్రతిఒక్కరూ కనీస బాధ్యతగా గుర్తించి ప్రోత్సహించాలన్నారు.

రాజకీయ నాయకుడు నిరంజన్ నాయుడు మృతి

బళ్లారి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకుడు నిరంజన్ నాయుడు(76) ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిరంజన్ నాయుడు కౌన్సిలర్‌గా, బుడా ఛైర్మన్‌గా, ఎమ్మెల్సీగానూ పనిచేశారు. నిరంజన్ తండ్రి భాస్కర్ నాయుడు కూడా ఎమ్మెల్యేగా పనిచేశారు. నిరంజన్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనను బళ్లారిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నారు. ఆదివారం ఆయన మృతిచెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. నిరంజన్ మృతికి పలువురు నాయకులు, పారిశ్రామిక వేత నారా సూర్యనారాయణ రెడ్డి, మాజీ మంత్రి తనయుడు ముండ్లూరు అనూప్ కుమార్, ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, మాజీ మంత్రి నాగేంద్ర, బుడా మాజీ అధ్యక్షుడు ముల్లంగి రవీంద్రబాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేసీ కొండయ్య, మేయర్ నందీష్‌బాబు, బుడా ఛైర్మన్ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, రంగనాథ్, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలు సోమవారం బళ్లారిలోని కౌల్‌బజార్ శ్మశాన వాటికలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వికసించిన బ్రహ్మకమలాలు



సోమశేఖర్ ఇంట్లో వికసించిన బ్రహ్మకమలాలు

బళ్లారి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని హరిప్రియ కాలనీలో నివాసం ఉంటున్న విశ్రాంత రిజిస్ట్రార్ సోమశేఖర్ ఇంటి ఆవరణలో నాటిన 32 బ్రహ్మకమలం చెట్లలో పూలె వికసించాయి. సోమశేఖర్ భార్య, తల్లి కొన్ని ఏళ్ల క్రితం బ్రహ్మకమలం మొక్కలు నాటారు. ఇవి మొత్తం ఒకే రోజు పువ్వులు వికసించాయి. దీన్ని తిలకించేందుకు చుట్టపక్కల కాలనీవాసులు తరలివచ్చారు.

అంధుల జీవితాల్లో వెలుగు నింపడమే లక్ష్యం

● ఆశ్రమ డైరెక్టర్ డాక్టర్ కల్లయ్య

బళ్లారి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంధుల జీవితాల్లో వెలుగులు నింపేందుకే గదగ్‌లోని వీరేశ్వర్ పుణ్యాశ్రమం కొనసాగుతుందని ఆశ్రమం డైరెక్టర్ డాక్టర్ కల్లయ్య అన్నారు. శ్రీ కుమారేశ్వర్ మ్యూజిక్, కల్చరల్ ట్రస్ట్ బళ్లారి, కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన త్రిభాషా కవియోగి డాక్టర్ కవిగవాయి 14వ జయంతి సంస్మరణ, తులాభార కార్యక్రమానికి పండిత పుట్టరాజు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ సకాలంలో వర్షాలు, పంటలు పండి భక్తులు సంతోషంగా ఉంటేనే మఠం, మాన్యం, ఆశ్రమాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. కమ్మరచేడు కల్యాణమఠం కల్యాణస్వామి మాట్లాడుతూ పండిత్ పుట్టరాజ గవాయి, డాక్టర్ కల్లయ్య అంధుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. అంధులకు సేవలు చేయడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో సురేఖ మల్లన్న గౌడ, నగర కార్పొరేటర్ల, కన్నడ, సాంస్కృతిక శాఖ అధికారి నాగరాజు, వెస్ట్ జోన్ బీఈవో సిద్దలింగ మూర్తి, గురప్ప, తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తమ



సేవకులను సన్మానిస్తున్న దృశ్యం

గౌడ, సీనియర్ జర్నలిస్టు, న్యాయవాది శశిదర్ మేటీ, ఎస్. మంజునాథ్, శివమూర్తి గౌడ, మల్లప్ప, చక్రసాలి వీరుష్ ఉడంకల్, దేవయ్య సామిలు, సురేష్, దివాకర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురిని సన్మానించారు.

అన్నపూర్ణమ్మ ప్రచారం

కంప్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ జోరుగా ప్రతి వార్డులో ఆదివారం ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని,



వార్డులో ప్రచారం చేస్తున్న రాజశేఖర్, జక్కి, అంజి



కుడితిని పట్టణంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ

పట్టణాన్ని పూర్తిగా అభివృద్ధిబాటలో పయనింపచేస్తామని అన్నారు. గతంలో ఎంపీ ఈ తుకారాం నియోజకవర్గాన్ని పూర్తిగా అభివృద్ధి చేశారన్నారు. ఈ సారి కూడా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అభ్యర్థితో పాటు రాజశేఖర్, జక్కి అంజి, వీరేంద్ర ప్రసాద్ నేతృత్వంలో వాడవాడలా ప్రచారం చేశారు. అధ్యక్షురాలు బసమ్మ, చంద్రప్ప, కనికేరి పంపాపతి, ఉపాధ్యక్షులు వెంకటరమణబాబు, లెనిన్, దుర్గప్ప, గంగాధర, మోటా తిమ్మ, పాల్గొన్నారు.

ఏళుబెంచిలో బీజేపీ...

కంప్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కుడితిని సమీపంలోని ఏళుబెంచి గ్రామంలో బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతప్ప జోరుగా ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఈ నాలుగేళ్ల సందూరు నియోజకవర్గంలో ఏ



వాడవాడలా ప్రచారం చేస్తున్న మాజీమంత్రి శ్రీరాములు



ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతప్ప

అభివృద్ధి జరగలేదని, జిల్లాలోనే అత్యధికంగా డీఎంఎఫ్ నిధులున్న పట్టణంలోనే అభివృద్ధి శూన్యంగా వుందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు తమ అమూల్యమైన ఓట్లతో భారీ మెజార్టీ అందిస్తే పూర్తిగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మాజీమంత్రి శ్రీరాములు కూడా వాడవాడలా తిరుగుతూ బీజేపీ గెలుపు కోసం ప్రచారం చేపట్టారు. వారితో పాటు స్థానికులు అంబన్న, సిద్దప్ప, రామచంద్రప్ప, ఇతరులు శంకర్‌దాస్, అంజి ఉన్నారు.

త్వరలోనే టిప్పుసుల్తాన్ సర్కిల్ నిర్మాణం



టిప్పు నేమ్‌బోర్డు వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రాయచూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మైసూరు పూర్వపు రాజు టిప్పు సుల్తాన్ పేరుతో నగరంలో సర్కిల్‌ను త్వరలోనే ఏర్పాటు చేస్తామని నగరసభ ఉపాధ్యక్షుడు సాజీద్ సమీర్ అన్నారు. టిప్పుసుల్తాన్ 275వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని అరబ్ మొహల్లా సర్కిల్‌లో టిప్పు పేరున ఉన్న నామ ఫలకానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ టిప్పుసుల్తాన్‌కు వ్యతిరేకంగా కొంతమంది దురుద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేయడం విచారకరమన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ సభ్యుడు బషీరుద్దీన్, టిప్పుసుల్తాన్ కమిటీ జిల్లాధ్యక్షుడు అబ్దుల్ హై ఫెరోజ్, కాంగ్రెస్ నేత మహ్మద్ శాలం పాల్గొన్నారు.

వరిధాన్యం రేట్లు తగ్గుముఖం

● కొనుగోలు కేంద్రాలు ప్రారంభించని ప్రభుత్వం

● ఆందోళనలో అన్నదాతలు

కంప్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరిధాన్యం రేట్లు తగ్గుముఖం పట్టాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తాలుకా పరిధిలోని బెళగోడు, సన్నాపురం, ఇటిగి, మన్నూరు, నూగూరు పరిధిలో నదిఒడ్డున వేసుకున్న ఖరీఫ్ పంటల కోతలు జోరుగా సాగుతున్నాయి. కానీ రేట్లు 15 రోజుల్లోపే 75 కిలోల బస్తాకు రూ. 300 నుంచి రూ.400 వరకు తగ్గడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదట కోతలు కోసిన వరి ధాన్యానికి రూ.1950 ధర పలకగా



సన్నాపురం వద్ద యంత్రంతో వరికోత కోస్తున్న దృశ్యం



అమ్మిన ధాన్యాన్ని లోడు చేయిస్తున్న రైతులు

ప్రస్తుతం రూ.1450 నుంచి రూ.1500 మాత్రమే పలుకుతుండటంతో తమకు ఈ యేడాది వరి పంట నష్టాలే మిగులుస్తాయని ఆందోళన చెందుతున్నారు. వీటికి తోడు తెగుళ్లు, నది ఒడ్డున వేసుకున్న వరి పంటకు శాపంగా మారయన్నారు. ఇటు రేట్లు కూడా తగ్గడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నట్లు రైతులు వాపోతున్నారు. ఎకరాకు కేవలం 30 నుంచి 35 బస్తాలే పండగా, వచ్చిన పంటకు కూడా వ్యాపారులు తమకు ఇష్టమొచ్చినట్లు కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని రైతులు అంటున్నారు. మొత్తానికి ఈసారి తెగుళ్లు, నదికి నీరు పోటెత్తడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. దీంతో రైతన్నలు పూర్తిగా నష్టపోతున్నామని తెలిపారు. వచ్చిన ధాన్యాన్ని నిల్వ వుంచుకోకుండా ఎటునుంచి తుఫాను వస్తుందోనని భయంతో కోసిన ధాన్యాన్ని అమ్మకాలు చేసి మార్కెట్లకు తరలిస్తున్నట్లు తెలిపారు.

ప్రపంచ వారసత్వ జాబితాలో చేరుస్తాం

● మంత్రి హెచ్‌కే పాటిల్



చరిత్ర సంపుటిని విడుదల చేస్తున్న మంత్రి పాటిల్, ఎమ్మెల్యే గవియప్ప

బళ్లారి సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దక్కన్ సుల్తానీ, హిరేబెనకల్‌లోని చరిత్రపూర్వ ప్రాంతం, శ్రీరంగపట్నం కోటలు, బాదామి నదిని ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నిస్తామని పర్యాటక శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ అన్నారు. శనివారం హంపి కన్నడ యూనివర్సిటీలో ప్రారంభమైన కర్ణాటక హిస్టరీ అకాడమీ 38వ వార్షిక జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హిస్టరీ అకాడమీ పరిశోధకులకు ప్రతి సంవత్సరం రూ.5 లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 25వేల స్మారక చిహ్నాలలో 844 చిహ్నాలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఇతర చిహ్నాలు కూడా తెలియజేస్తామన్నారు. స్మారక చిహ్నాలను నోటిఫై చేసి పనిని హిస్టరీ అకాడమీ సిద్ధం చేస్తే సాంకేతిక, పరిపాలన, ఆర్థిక బలాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 556 స్మారక చిహ్నాలను స్క్రీనింగ్, స్కానింగ్, త్రీడీ డిజిటల్ సాఫ్ట్‌వేర్ ద్వారా రికార్డు చేసే పనిని పర్యాటక శాఖ చేపట్టిందన్నారు. అనంతరంఎమ్మెల్యే హెచ్.గవియప్ప, చరిత్ర (ఇతిహాస) దర్శనం, సంపుటిని విడుదల చేశారు. 12 మంది పండితులను అకాడమీ అవార్డులతో సత్కరించారు.

కంటి ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న చిక్కినకొప్ప చెన్నవీరస్వాములు

కంప్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కంటి ఆస్పత్రి నిర్మాణానికి చిక్కినకొప్ప చెన్నవీరస్వాములు భూమిపూజ చేశారు. పట్టణంలో గత కొన్నేళ్లుగా చిక్కినకొప్ప చెన్నవీరతాత ఆధ్వర్యంలో ఎంతో మందికి ఉచితంగా నేత్ర చికిత్సలు చేయించేవారు. గత కొంతకాలంగా కంప్లిలో వసతులు లేకపోవడంతో పేద ప్రజలకు కంటి చికిత్సలు నిలిపివేశారు. కంప్లికొట్టాలకు చెందిన కోళూరు సత్యనారాయణ సొంతంగా ఎన్నో లక్షలు విలువ చేసే భూమిని ఆస్పత్రి కోసం 15 సెంట్లు ఉచితంగా ఇవ్వడంతో ఆదివారం ఆస్పత్రి నిర్మాణానికి శ్రీకారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజలను దృష్టిలో వుంచుకునే ప్రతి యేటా ఉచితంగా ఎంతో మందికి చికిత్సలు చేయించామన్నారు. డాక్టర్ మంజునాథ మాట్లాడుతూ ఇప్పటికే ఆరువేల మందికి ఉచితంగా కంటి చికిత్సలు అందించామన్నారు. మున్ముందు ఆస్పత్రి ఏర్పడి తరువాత పూర్తిగా పేద కుటుంబాల వారికి చికిత్సలు చేస్తామన్నారు. ఉచితంగా స్థలం ఇవ్వడం ఎంతో ఆనందించదగిన విషయమన్నారు. కోళూరు నారాయణప్ప, కోళూరు సత్యనారాయణలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు లింగనగౌడ, తిరుమల మంజునాథ, మూకయ్యస్వామి, నాగరాజుస్వామి, వాలి కొట్రప్ప, కొట్రేష్, బసవేశ్వరరావు, సాయిబాబా, సత్యనారాయణ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సాధించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

బళ్లారి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా రిజిస్ట్రార్ మాబున్నీసా బేగం అన్నారు. ఆదివారం బెస్టు కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు వివిధ కంపెనీల ఫ్యాకల్టీతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల జీవితంలో ప్రీ గ్రాడ్యుయేట్ విద్య కొత్తకోణమని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలు భవిషత్తుకు మంచి విద్య, ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందడానికి బెస్టు కళాశాల ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ఫిజిక్స్ లెక్చరర్ సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలు ఎదుర్కోవడం, ఇంటరాక్ట్ కావడంపై అవగాహన ఇచ్చారు. కార్యక్రమంలో లెక్చరల్ మంజునాథ్, 20 ఉన్నత పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సబ్జెక్టు లెక్చరర్లు, కళాశాల యాజమాన్యం, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాలువలకు నీటి సరఫరాను కొనసాగించాలి

● రైతు సంఘం డిమాండ్



నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

బళ్లారి సిటీ, నవంబరు 10: విజయనగరం జిల్లాలోని పురాతన కాలువలకు రెండు నెలలుగా నీటి సరఫరా నిలిచిపోతే నష్టపోతామని, నెల రోజుల పాటు మాత్రమే నీటిని నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హొస్పేట రైతు సంఘం నాయకులు నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్‌కు వినతి పత్రం సమర్పించారు. రైతు సంఘం అధ్యక్షుడు కాటగి జంబయ్య మాట్లాడుతూ విజయనగరం కాలువలైన రాయ, బసవ, బెల్ల, తుర్త కలఘట్ట కాలువలు మరమ్మతుల కోసం ఏటా నీటిని నిలిపివేస్తున్నారని అన్నారు. దీంతో వ్యవసాయ భూములకు సరిపడా నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రెండు మూడేళ్లుగా రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. రెండు నెలలకు బదులు నెల రోజుల పాటు (డిసెంబరు 10 నుంచి జనవరి10 2025వరకు) నీటిని నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు కాటగి జంబయ్య నాయక్, డైరెక్టర్లు ఉత్తంగి కొట్రేష్, రాంపూర్ యల్లప్ప, జోగయ్య, పరసప్ప, గాదిలింగప్ప, నాయకులు కణివెప్ప, అంబన్న, తల్వార్ మహేశ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలపై అవగాహన పెంచుకోవాలి



భారత రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

రాయచూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆలోచనలు, ఆయన జీవిత చరిత్ర, ఆయన చూపిన మా ర్గంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని చరిత్రకారుడు కోటగానహళ్ళి రామయ్య అన్నా రు. నగరంలోని పండిట్ సిద్ధరామ్ జంబలదిన్ని రంగమందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ వంద రోజుల సంభ్రమ కుటుంబ సభ్యుల అభినందన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. బహుజన సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తొలుత అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగ పీఠికను చదవడం ద్వారా రామయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం యన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతగా అంబేడ్కర్‌ను ప్రతి ఏటా ఆయన జయంతి రోజు గుర్తించుకోవడం దేశమంతటికి పరిచయమే అయినా ఆయన జీవన విధానం చరిత్ర నేటి తరానికి మరింత విస్తృతంగా తెలియాల్సి ఉందన్నారు.

హోసూరు జోన్

30నుంచి మహా అశ్వమేధయాగం

హోసూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): లోకకల్యాణార్థం హోసూరు నగరంలో అశ్వమేధయాగం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే మనోహరన్ తెలిపారు. నగరంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజల చేత విశ్వవ్యాప్త మహా సంకల్ప యాగం, మహా అశ్వయాగం, మహా అశ్వమేధ యాగం నిర్వహించదలిచామన్నారు. హోసూరు శ్రీ కోటమారియమ్మ ఆలయం వెనుక భాగంలో నవంబరు 30 నుంచి డిసెంబరు 4 వరకు ఆరు రోజుల పాటు యాగాలు ఉంటాయన్నారు. 108 యాగ కుండాలను ఏర్పాటు చేసి వాటిలో 148 మంది దేవతలను ఆదిభూత లింగం, ఆది శివలింగం, ఆదిమనోహరలింగం ఆరాధన ఉంటుందన్నారు. యాగ సమయంలో తరువాత ప్రజలు వివిధ మార్పులను పరిశీలించవచ్చునన్నారు. ఈనెల 18 నుంచి 29 వరకు హోసూరు ఆంధ్రసాంస్కృతిక సమితిలో పలు సాహిత్య, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిరాజ్, కాంగ్రెస్ సత్య మూర్తి, బత్తలపల్లి గోపాల్, క్లీనర్ రాజు, కోదండరామన్, బాలకృష్ణన్, మోహన్‌రాజ్, గణేశ్ అభయ్కర్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానిత సభలో మాజీ ఎమ్మెల్యే మనోహరన్, ఐఎన్‌టీయూసీ నాయకులు మునిరాజ్, త్యాగరాజన్

అన్నాడీఎంకే కార్యకర్తల సమావేశం

హోసూరు, నవంబర్ 10(ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే పార్టీ ఆధ్వర్యంలో హోసూరు సిటి వెస్ట్‌లో క్రీడాకారుల కోసం సమావేశం నిర్వహించారు. సమావేశానికి పశ్చిమ ప్రాంత కార్యదర్శి మంజునాథ్ అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, అన్నాడీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి మనిస్వామి పాల్గొన్నారు. మునిస్వామి మాట్లాడుతూ మీడియా, రాజకీయ ప్రముఖులు సహా ఎవ్వరు మమ్మల్ని సిద్ధం చేయాల్సిన అవసరం లేదన్నారు. అదే మా ప్రాణం అని ఈ ఉద్యమం మళ్లీ రావాలని కోరుకునే కోటిన్నర మంది అన్నాడీఎంకే కార్యకర్తలను సిద్ధం చేస్తే బాగుంటుంద న్నారు. అధికారం కోసం, పొత్తుల గురించి మనం చింతించాల్సిన అవసరం లేదన్నారు. మన కాళ్లపై నిలబడే శక్తిని విప్లవనాయకుడు అందించారన్నారు. సమావేశంలో హోసూరు ప్రాంతానికి చెందిన పలువురు అన్నాడీఎంకే కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేపీ మునిస్వామి

వేల్‌మురుగన్‌కు విశేషపూజలు

హోసూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో ప్రసిద్ధి చెందిన వేల్‌మురుగన్ ఆలయంలో స్కందషష్టి వ్రతాలు పూర్తి కావడంతో ఆదివారం నెమలి వాహనంపై ఊరేగించారు. ఈనెల 2న స్కంద షష్టి ఉత్సవాలు ప్రారంభం కాగా ఆదివారంతో ముగిశాయి. వేలాది మంది భక్తులు భక్తి పారవశ్యంతో హరోహరా వేల్ మురుగా అంటూ భక్తులు నినదిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. నగరమంతటా స్వామికి ప్రత్యేక దీపారాధనలు నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించారు.



మయూరవాహనంపై సుబ్రహ్మణ్యస్వామి ఊరేగింపు